కథ :

ఖండన

సువర్ణముఖి

పొద్దుదూరనేదు తొలికోడైనా కుయ్యనేదు ముఖలింగం చింతపండు కావిడి తోటి పట్నంకాసి బయిదెల్లాడు. ఊరు దాటి ఉయ్యకోడిపోదు అంచులెల్లి నడుస్తుంటే వొంట్లో వణుకు పుడతంది.

ఏ ఆపీసర్ బాప్ కంటల బడిపోతనేటోనని.

ముఖలింగం నడకతోటి సమానంగా ఉట్టెలు కూడా వణుకుతున్నట్టు వూగుతున్నాయ్—

ఏ ఆపీసు మూలపడిపోయి మా బతుకులు ఏ సెదపురుగులు కొట్టెత్తవో నన్న బయంతోటి గావాల.

చింతపండు మీద మంచు పడతంది. మంచు బాగా పడితే - "తడిపేసి దెంకొచ్చినావేటిరా" అని రేటు తగ్గించేత్తరు. అందుకే ఆ పక్కనున్న చింత గున్న దగ్గర కావిడి దింపేసి అడ్డాకులు తెంపికొచ్చి మీదేసినాడు. ఏలాగ దించినాను గదా- అని చుట్ట ముట్టించినాడు.

చుట్టూ చీకటిగుంది. మొక్కా చెట్టూ కనబడకుండా అంతా చీకట్ల కలిసిపోయింది. కొండలన్ని ఏనుగులు తొంగున్నట్టుగ కనబడతన్నయ్. ఎదురుగున్న బోడికొండ సిగిలిం మీద మాత్రం ఈరగొట్టాపు (వీరఘట్టం) సావుకారి పట్టబుర్ర మీద నిక్కబొడిసి కూకున్న నాలుగు పుంజీల ఎంట్రుకల్లాగే కనబడుతున్నయ్ ఆ కొండమీదున్న రెండు చెట్లోవో.

సైద్ధాంతిక పోరాటం చేయవలసిన బాధ్యత విప్లవ రచయితలమీద ఉంది. ప్రజలకీ, ప్రజాపోరాటాలకీ, మార్క్సిజం లెనినిజం, మావో ఆలోచనా విధానానికి నిబద్ధమై పోరాటం చేసినంత కాలం విప్లవ రచయితల సంఘం అజేయంగా పురోగమిస్తుంది. 1970-80 దశాబ్దాన్ని విరసం దశాబ్దం అన్నారు. 1980-90 దశాబ్దం కూడా నిస్సందేహంగా విరసం దశాబ్దమే.

"అతనిది యుద్ధ వ్యాకరణం!
ఫిరంగి భాష"

1008

అక్కడకొసె బయిదెల్లి అగాటీ మీదకెల్లేసరికి పల్లపు గ్రామాల లైట్లన్నీ వెలిగి చెరువులోని తామర పువ్వుల్లాగ కనబడతన్నయ్. అట్న చూస్సరికి పులినోటి లోకి పెలుతున్నట్లుగ అనిపించి మరింత బయమేసింది.

అగాటీ దిగీసరికి బలబల తెల్లారతంది. అడవి గూడా తెరిపిచ్చింది. గబగబా నాలుగడుగులేసి రోడ్డు పాయింట్ కి చేరుకున్నాడు.

అప్పుడికే టిటుకుపాయి సవర్లు ఇద్దరు బస్సుకోసం కాత్తన్నరు.

"ఎక్కడికివోయ్" అడిగినాడు మొఖలింగం.

"ఉ.... పి. వోగాడి దగ్గిరిక్కి" అని ఒకడంటే

"హ్వారు మాసాలబట్టే.... ఇలగ్గే తిరగతన్నమ్....ఒక నోనూ నేదూ....గీనూ నేదూ వ్వాళ్లు పుల్లయ్‌పోతంది....ఇల్లు గుల్లయ్ పోతంది" అలాగ మాట్లాడి అటు చూసాడు. గెద్దొచ్చి కోడిపిల్ల నెత్తికెలి పోయినట్టగ "జయ్య్"మని జీపి వచ్చి బుర్రు మని ఇటుకోసి, కేసొంపుగ అటుకోసి, వచ్చిన కాసే తిప్పి ఆపాడు ఆ జీపి. అపీసరికి టపీమని మందుకాసి అపీసర్ గెంతినాడు.

రైడ్ పార్టీవోల్లాగ గుమాస్తాలు గెంతినారు. వచ్చీరావడమే-

"ఎవుడిరా! ఈః చింత పిక్క ఎవుడిదేస్" అనీసి ఎర్రగించి ఒక చూపు చూసి

"మ్మ్యయమ్మ....ఎందిరా ఎవుడూ నోరు మెదపడు. ఎవుడిదీ కాదేటిరా" అరిచాడు అపీసర్.

అపీసరు అరిచీసరికి పలక్కపోతే పట్టికెలి పోతదేటోనని-

"నాదిబ్బావ్....తిండిపండు బావ్" గుటకలు మింగాడు మొఖలింగం.

"ఏటేటిరా! తిండిపండా!.... ఏటి నీ పెల్లం నువ్వు పట్నమ్లో కాపరమెట్టినా రేటిరా.... వెదవ కబుర్లాడకు.... చింతపండు జీపులేసి, నువ్వు జీపెక్కరా" జీపెక్కకపోతే తంతానన్నట్లు చూసాడు అపీసర్.

"బావ్వ్....తిండిపండేనిబ్బావ్"

"అప్పురా రంకునేర్సినదాయి....బొంకు నేర్సక మానాదా ?"

"బావ్....స్సెమించండి బావ్....నానే రోడ్డోరవీ గట్రా యేరనేదు బావ్. నా కొండ మీదవి బావ్."

"అమ్మనీయ్యమ్మన్నీ తెలివితేటలా....కొండ, మీయ్యమ్మదే మీబావ్‌దిరా.... నంజాకొడ్క.... కొండ గవ్రమెంటుదిరా. కొండమీద గంటి గింజ వేసు

1009

పన్నంతమాత్రాన కొండ నీదై పోయిందేటిరా" అనీసి గిర్రున గుమాస్తాలకాసి తిరిగి- "ఏయ్.... ఇది ఎక్కించండివోయ్" అని అరిచి, సిగిరెట్టు తీసి ముట్టిస్తూ......
"గవ్రమెంటు మీకు నెత్తికెక్కించుకుంతందిరా.... ఇక్కడ మీకేటో రచ్చిద్దుమని కార్పోరేషన్లూ....గీర్పోరేషన్లూ, ఎట్టి మాకు దెచ్చి, ఈ అడివిల దించితే మీయ్యమ్మ మీరేమో దొడ్డిదార్ని దెంకెలి పోతన్నర్రా" గిర్రున అటు తిరిగి "ఎక్కించండి వోయ్....చూ త్తారేటింకా!" అని గుమాస్తాల కాసి అరిచాడు.

"బాప్ మా గుంటముండ పాపకి పెళ్లి బాప్.... ఒక్పావల డబ్బులు ఎక్కవొత్తే దనికోక నంగా ముక్క కొనొచ్చునని ఇల్ల దించినాన్ బాప్.... నాను పిల్లప్పుడు కాసి ఎప్పుడూ ఇలాపింటి పని చెయ్యనేదు బాప్" అనీసి ఏడుసుకోని చింత పండు గంపలకి ఏలబడిపోనాడు.

"అహ్హా.... పావల్డబ్బులు ఎక్కవొత్తాయని కిందకి దించినావా....అలగయితే మరేర్లా బియ్యపు గింజలు కిందనే గొనుకోరా....ఉహూ....అలగ మళ్లీ చెయ్యర్రా.... నావి పాతిక్కేజీలు....నావి పదేనుక్కేజీలు అని దెబ్బవాడి దెబ్బుతార్రా....అప్పుడు మీకు కార్పోరేషన్ గావాలిరా....తెలివితేటలా ఎక్కువై పోనయిరా మీకు ...అంత ఎక్కువుంతే వంటికి పెమాదమురోయ్....పార్తుపురం (పార్వతీపురం) పాయిదాకిచ్చీయర్రా....ఇంకా ఎక్కువై తే ఈరగొట్టాం వడ్డీకిచ్చీయర్రా"

"బావ్వ్వ్.... మీరు దేవుడినాటోలు బావ్వా....తెలీక సెస్పీనాన్ బావ్.... బావ్ నా కూతురి పెళ్లి మీరే చేసినట్టు గుంతాది బావ్.... వద్లీయండిబావ్" అని ఆపీసరు కాళ్లకి చుట్టుకొని మొఖలింగం ఏడుత్తుంటే మందవోన ఆవుని పులినోట కరిసిత్తే మిగతా ఆవులు తుప్పలు చాటు కంచి చూసినట్టగ టిటుకుపాయి సవర్లు చూసుకోని అలగే వుండిపోన్రు.

కాళ్ళు పట్టుకున్న మొఖలింగాన్ని బూటుకాలుతోటి తన్నీసాడు అపీసరుబావు చింతపండు జీపెక్కించుకోని జీపు మాయమైపోయింది.

జీపు కనబడి నంతవరకూ వెనకే పరిగెడుతూ "బావూ వద్లీయండి బావూ.... బావ్ రచ్చించండి బావ్....బావ్ నా కూతురిపెళ్లి ఆగిపోద్ది బావ్...." అంటూ అరుస్తూ కారెనకే పరిగెట్టాడు.

పిల్లని ఎత్తుకుపోయిన గెద్ద వెనక తల్లి కోడిలాగే అరిచాడు.

1010

చేసేంది లేక దోసుబాయి ఆపీసుకు ఐయిదెల్లినాడు....ఎటబుద్దో.... నా చింత పండు ఎటబుద్దో.... కూతురి పెళ్లి ఎటబుద్దో అని ఆతృతతోటి నడక సాగించాడు.

గంజీ గడుగూ లేకుండా—

o o o

వళ్లు చీరుకున్నా కనబడనంత చీకటి గడ్డిపిట్ట లెక్కడో కిచుకిచు వాడతన్నయి. దారికింద పెల్లి గెట్టి గలగల రాళ్ల మీద నుంచి పారతంది.

నెమ్మదిగా అడుగు లేసుకొని పూరుకాసి నడుస్తున్నాడు మొఖలింగం. పూరి మద్దిన దీపమేదో ఎలుగుతంది. ఆ దీపాన్ని చూసాడుగాని ఆ ధ్యాసలోనే లేడు కళ్ళ ముందే కదులుతన్నయ్ ఆపీసర్ల బాపుల తిట్లు. తుమ్మిక మొజ్జులాగ వున్న ఆపీసర్ బాప్ అయితే-

"ఆయన గాబట్టి పండు దీసుకొనే వదిలీసినాడు నానైతే పళ్లిరగ దొడిసి బొక్కల తోసిద్దును" అవన్నీ గుర్తుకొచ్చి ఇంకా ఆపీసు దగ్గిరున్నట్టే నడుస్తుంటే

"ఎవరూ" ఎవులో కొత్తోలే గంబీరంగా అడిగారు.

మొఖలింగం వళ్లు జల్లు దొడిసింది. నా పూరుకాడ నాకెపులు అడుగుత[నని కాదు తనని పట్టుకోడానికి పోలీసులు గ[టా వచ్చారేటోనని. అయినా అయినంత య్యింది ఇంకా ఏటుంది అనుకున్నాడు.

"న్నీను బాప్" అన్నాడు.

"నువ్వంటే"

"మొఖలింగడ్ని బాప్"

"ఏ వూరు"

"ఈ గూడేనిబాప్" అంటూ దగ్గరగా వచ్చి దీగాన కాసి ఎగాన వరకూ చూసి వసిలబోయి పక్కకెల్లి ఎల్లిపోతన్నాడు మొఖలింగం.

"అన్నా నన్ను ఎవరనుకుంటున్నావన్నా" అన్నాడు అతడు.

"నాకెందుకు బాప్ ఏటీని అనుకోడం నా దారినాదీ" అన్నాడు.

"మనం కా[మేడ్ల మన్న. పూర్లోన మీటింగు అవుతుంది యెళ్లు." అన్నాడు అన్నాయన సెం[టీకి నిలుచున్న దివాకర్.

చింతపండు పోయిన సంగతి మర్సిలేకపోనాడు. అయినా ఆ బాధ దిగ[మింగు కోని మీటింగు చూడాలని నాలుగడుగులు ఎక్కువేసాడు.

1011

కామ్రేడ్లు ఇటు కూకోని అటు ముఖం బెట్టారు. గూడోలు అటు కూకోని ఇటు ముఖం బెట్టారు. అలకీ ఈలకీ మద్దిన దీపం గాలికి రెపరెప లాడతంది. మొఖలింగం కూతురు ముందరే కూకుంది. మతిమడపాలు మీద-దృష్టి దీపాలమీద అన్నట్లు మీటింగుల కూకుందే గాని అయ్య ఎప్పుడొత్తాడా అని అటుకాసే చూత్తంది.

అయ్య కనబడ్డంతోటి గబుక్కున నెగిసిపోయి అయ్యకెదురెల్లి సంచి నాక్కుంది. సంచిల చెయ్యెట్టి చూసింది ఏటీలేదు. అయ్య ముఖం చూసింది. ఆ చూపులో నాకు "నంగా తెత్తానన్నావేది" అన్నట్లనిపించింది మొఖలింగంకి. కూతురు మొఖం సూస్సరికి ఏడుపొచ్చింది. కూతురు బుజమ్మీద చెయ్యేసి ముంజూరు దగ్గిర బుర్రొంచి ఇంటిల దూరిపోండు.

మీటింగు సాగుతుంది మాటలకి కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి.

"....ఆనాడు పిత్త పరిగి ఉప్పుచేప ఇచ్చి మన పల్లం బూమి తీసుకున్నారు. ఉల్లిపాయా ఉప్పుగడ్డ ఇచ్చి మన ఊట బూమి తీసుకున్నారు. ఇదీ అన్యాయం బావూ.... ఇదీ అక్రమం బావూ అన్నందుకు మూడువందలయాభై మంది మన సవర జాతపుల్ని చంపారు. ఆణిముత్యాల్లాంటి మన నాయకుల్ని చంపారు. అయితే వాళ్లు ఏ ఆశయం కోసం ప్రాణాలిచ్చారో ఆ ఆశయం ఈవాళ మనముందు వుంచారు. ఆ ఆశయాన్ని కొనసాగించాలా ? వద్దా ?" మీటింగుల మధ్యలో గూడ వాళ్లకి ప్రశ్నేసాడు కమాండర్.

"చెప్పండి! కొనసాగించాలా ? వద్దా ?" అన్నాడు మళ్లీ.

మొఖలింగం అప్పుడే వచ్చి కూకున్నాడు. "అవును నిజమే పోరాటం చెయ్యాలి" లోలోనే అనుకున్నాడు. ఏటి చెప్పాలో వాళ్లకి తెలీలేదు.

దశిమియ్య ఏదో చెప్పాలని తడబడుతూ—

"వ్వద్దూ" అన్నాడు.

తనేటి చెప్పానో వాళ్లకు అర్థమవ్వలేదన్న సంగతి కమాండర్‌కు అర్థమయ్యింది.

"మనోలు కూడు కోసం గుడ్డ కోసం ఉన్నోలితోని పోరాడినారు....ఆ కూడూ గుడ్డా రాకమునుపే మనోలు చచ్చిపోన్రు. మనోలిని చంపేసిన గవర్మెంటు మీద మన బువ్వకోసం మన బట్టకోసం పోరాటం చెయ్యాలా ? వద్దా ? ఇప్పుడు చెప్పండి" అన్నాడు కమాండర్ ఈసారైనా కృతకృత్యుడిని అవుతానా లేదా అన్నట్లు.

"చెయ్యాలి" "చెయ్యాలి" అన్నారు.

మొఖలింగం తన సమస్య కామ్రేడ్లకు చెప్పాలని తొందరవుతున్నాడు.

"చెయాలంటే దళిమియ్య ఒక్కడు చేత్తే అయిపోద్దా! నాను ఒక్కడ్ని చేత్తే అయిపోద్దా! అన్నాడు కమాండర్.

""“కట్టుగుంతే అవుద్ది కామ్రే"అన్నారెవులో

"ఒక్కలితోటి కాదు కామ్రే" అన్నారెవులో

"మా విషయమేటి ఇంకా మాట్లాడరు" అన్నట్లు చూత్తన్నరు యువకులు ఎవులో నెగిసి ఒకటి కెల్లారు. ఇంకెవరో చుట్ట ముట్టించారు.

"బాగుంది అయితే మనం సంగం పెట్టుకున్నట్టే గదా! దానికి మెంబర్లుగా ఎవులి నెట్టుకుంతం" అన్నాడు కమాండర్.

"మొయింగడ్ని, దళింగాడ్ని ఎట్టండి" అన్నారెవలో

సంగం బెట్టుకున్నారు మొఖలింగం మీటింగు మద్యలోంచి నెగిసి ఇంట్లోకి పరిగెట్టాడు. అందరూ పల్లకే అటే చూసినారు.

సిద్దలోన ఆముదం దివ్వకుద్ది లోనేసి పలచటి గుడ్డ చింపి వొత్తెట్టి మీటింగు మద్దిలోకి తీసికొచ్చారు. ఏటి చేత్తన్నడో అర్థమవ్వనేదు దళ సభ్యులకు. అందరూ ఉత్కంఠతో చూత్తన్నరు.

అగ్గిపుల్ల రంగ దీసి దీప మెలిగించాడు. వెంటనే నిలబడి "వ్వొరే సంగ మెట్టుకున్నట్టగ క్కాదురా! కట్టానికి నట్టానికి మంచికీ చ్చెడుకీ సంగం తోటి ఉంతామని పెమానం చ్చెయ్యండిరా అగిని సాచ్చిగ పెమానం చెయ్యండిరా" అన్నాడు.

వాళ్లలో పట్టుదల కసీ చూసేసరికి దళమంతటికీ వెంపటాపు సత్తిం కనిపించినట్లయింది.

"ర్రండిరా ఎవుడెవుడుంతాడో ప్పెమానం చెయ్యండిరా.... ఒర్రే నా చింత పండు దొబ్బినార్రా కార్పొరేషనోలు ఏమన్నాయం చేసినామని దొబ్బినార్రా........ ఏమన్నాయం చెయ్యకుండ ఆలిట్ట మొచ్చినట్టగ ఆలు దెబ్బుతుంటే న్యాత్తామేటి చెప్పండిరా" అన్నాడు బాధగా కసిగా మొఖలింగం.

అటు దళానికి ఇటు గూడోలికి అప్పుడే తెలిసింది మొఖలింగం చింతపండు పోయినట్టుగ.

ఏడుపొత్తంది మొఖలింగంకి అయినా అదిమిపట్టి "ర్రండిరా" మళ్ళీ పిలిచాడు.

1013

ఒక ముసలిదాయి నెగిసింది దీపం దగ్గిరికొచ్చింది—

"కామ్రేడ్ నాది మొగుడు సంగంకోసం చచ్చినాడు నాను సవ్వడానికి సిద్ధమై.... ఇష్టపూర్వకంగా....అగిని సాచ్చిగ పెమానం పెమానం చేత్తన్ను....గాని....ఆడిని చంపాలికామ్రేడ్" అన్నది—

"ఎపులిసీ" అన్నట్లు అందరూ నుదురు చిట్లించి చూసారు.

"మేరిది సత్తిమ్‌గాడ్ని కామ్రేడ్....చంపేయ్యాలికామ్రేడ్" అన్నాది

కోరన్నా మంగన్న ఆమెకు కొడుకులు కాదు. కాని కోరన్నా మంగన్న అమరులై ఆ తల్లికి కొడుకులయ్యారు. అందుకే ఆ వర్గకసి ఆమె కళ్ళల్లో చింత నిప్పుల్లా వెలుగుతుంది.

మరెవరో లేచారు దీపం మీద చెయ్యిపెట్టారు....వరుసకట్టారు....గూడ గూడంతా పెమానం చేత్తన్రు.

ముక్కడు మొఖలింగం చింతపండు ఎలాగ తేవాలా? అని ఆలోచిస్తూ గుబుక్కున ఇంటిలోకి దూరి గూనలోకి చెయ్యిబెట్టాడు "కిచు" "కిచు" మని సురి పెలక పారిపోయింది. ముచ్చి సంచిలో నున్న గుడ్డ తీసాడు. అది యివతలికి తీసుకొచ్చి యిప్పాడు.

అది ఎర్రజెండా అనాటిది. చిన్న చిన్న ముక్కలు ఎలుకలు కొట్టేశాయి అది దీపం ముందుకు తీసుకొచ్చి—

"ఓరి మొయిలింగా....హ్హా....అపీసర్ బాప్‌కి ఇదిచూపి మా చింతపిక్క ఇవ్వకపోతే నీ సంగతి మాం చూసుకుంతమ్ అని చెప్పుదం" అన్నాడు.

దళమంతటికీ ఆ పద్ధతి బాగున్నట్లనిపించింది—

పక్కనున్న యువకుల మద్దిన కూకున్న నడి వయస్కుడొకడు నెగిసి "కామ్రేడ్ .. ఇందాక నాను చెప్పిన మడిచెక్కల గురించి ఏటి చేస్తమ్‌కామ్రేడ్" అన్నాడు అని తొడమీద పాకుదుతున్న సీమను టపీలుమని కొట్టాడు అది అలాగే అంటుకుంది.

ఇందాక వచ్చీరావడమే అతడు చెప్పినాడు వూర్లో నాలుగొందల ఎకరాల బూముందని, అది సావుకారిదని—

శ్రీకాకుళ పోరాటంలో బుగతలందరూ బూములొదిలి పారిపోనారు అలాగ పారిపోయిన పల్లపురాజు శ్రీరామరాజు మాత్రం పోరాటం అగిపోగానే మళ్ళీ

1014

వచ్చాడు—వచ్చేసరికి అందరూ భూమి పంచుకొని చేసుకుంతన్రు—అప్పుడేటి చేసాడంటే అదిచెప్పాడు—ఇదిచెప్పాడు—మిలట్రోలని తెత్తానని చెప్పి, ఆ భూములు అలపేర్నేపుంచి సమచ్చరానికి—ఎకరాకి—నాలుగొందలు లెక్కని ఖండన చేసుకొని గత పాతికేళ్ళగా సొమ్ము తింతండు.

అది ఆ ఖండన విషయమే మాట్లాడమని ఆ యువకుడు అన్నాడు. అందరూ పల్లక సూకున్నారు కమాండర్ మొదలెట్టాడు—

"కామ్రేడ్స్ నాడు బోగబంధ, ఖండగుత్తల దోపిడి నుంచి మనల్ని విముక్తి చెయ్యడానికి ఎన్నో త్యాగాలు చేసి ఎందరో బిగతల్ని పంపింవారు....కాని వాటి కొనసాగింపుగా సాగుతున్న ఈ ఖండనకి ఇక్కడితో మనం ఆపు చేయాలి." అని మాట్లాడుతూ "ఈ సమచ్చరం ఆడికి డబ్బు కట్టీసారేటి?" అని ప్రశ్నించాడు.

"కట్టనేదుకామ్రే మొన్న గుమస్తా వత్తే ఈ యేడు పంట రానేదూ.... సొమ్ము నేదు తర్వాత కడతాంనే అని చెప్పినాం కామ్రే....ఈ సంతనోపే (సోమారంనోపే)—స్పావుకారి రావచ్చును కామ్రే" అన్నాడు.

"అయితే ఆడొచ్చిన యెంటనే మేమివ్వమ్ అనిచెప్పి ఆడ్ని పంపించండి" అని చెబుతూ ఎలా చెయ్యాలో చెప్పాడు. చెబుతూ—

"భూములకోసం మీరు బాధపడవద్దు అవసరమైతే బిగతబుర్ర తీసైనా తెద్దుం" అన్నాడు

ఇందాకటి ముసలమ్మ నెగిసింది "కామ్రే బూమువొద్దు కామ్రే....మేరిది సత్తింని చంపండి కామ్రే" అన్నది కొంచం బాధగా....విసుగ్గా....కసిగా.

అవును అప్పుడు కోరన్న మంగన్నని చంపిన మేడిదిసత్యం అలా వుంటుండగానే గవర్నమెంటు గిరిజనులకు అభివృద్ధి అని చెప్పి రోడ్డు వేసింది. కరెంటు బల్బువేసింది ఇవన్ని ఏసి మరిపించీసి మేడిది సత్యంని కనీసం అరెస్టయినా చెయ్యలేదు సరికదా వాడి రక్షణకు తుపాకులిచ్చింది.

ఈవాళ కామ్రేడ్లు బూములు కోసం పోరాటం చేద్దుం అంటన్రు....ఆపీసర్లతోటి పోరాటం చేద్దుమంటన్రు....ఇవన్నీ చేసి ఆ సత్తింని సంపడం మరిసిపోతారేటోనని బయమోతప్ప బూమువొద్దనికాదు—ఆ కల్లల్లో పేణం వుండగానే ఆడి రత్తం చూడాలని అనుకొంటుంది.

"అలాగేనమ్మా తప్పకుండా" అన్నాడు కమాండర్

1015

కిట్టులు వీపునెక్కాయి. దళం పూరవతల మామిడి గున్నకాసి అడ్డగ కొండ మీదకి పొడిసేసింది.

* * *

వారం రోజులు తిరిగింది. బలబల తెల్లారతంది. కొండమీదనుంచి నెమలి అరుస్తుంది.

సావుకారి అడుగులు తడబడతన్నయ్ మళ్ళీ నచ్చ లైట్లొచ్చినారు. ఇంతకు ముందోలు పోనారు గనుక "సచ్చినోడి పెళ్ళికి వచ్చిందే కట్నంలాగ" పోవలసిన బాపులు మీద ఎకరాకి నాలుగొందలు వచ్చేవి. ఆటికి వాపురోజులు దగ్గరై పోనాయి ఆలోచనలు బయపెడుతున్నా బయటకు బయపడకుండా నడుస్తున్నాడు.

కొండ మీద ఒక ఏటు పేలింది (మజిల్ లోడర్ పేలింది) సావుకారి గుండె జల్లుమంది "నక్సలైట్లు గట్రా పేల్చనేదుకదా!" అనుకున్నాడు.

పూరు దగ్గరైంది సెకలించాడు కుక్కలు "బొవ్వ్" మని అరిచాయి.

ఆ సెకలింపు సావుకారిదే అని తెలిసి పల్లక తొంగున్నారందరూ....

ముఖలింగం పాకదగ్గరకొచ్చాడు సావుకారి, వచ్చి నిలబడి—

"ఓరి మొయిలింగా ....మొయ్లింగా.... నెగురా మీద కంచి చల్లగుంది కిందకాసి కుంపటి దానికి తోడు దుప్పటి యెచ్చగుందేమిరా" అన్నాడు ముఖలింగం ఉలుకులేదు పలుకూలేదు దశిమియ్య ఇంటికి వచ్చి వొంగోని పిలిచాడు—

"అవుర్నా దశింగా....దశింగా .... ఏంటిరా టక్కెట్టిసినారా తొంగుండి పోనార్రా....దొంగలొచ్చి ఏటి దెంకెలిపోయినా ఇంతే గదరా" అని అన్నాడు

"నీయ్యమ్మ నీకంటా దొంగనాకొడుక్కి ఇంకెపుడున్నాడురా" దుప్పట్లోనే గొనుక్కున్నాడు —దశిమియ్య

ఒక్కొక్కరు నెగిసినారు మెంబరుగారి అరుగుమీదకూకున్న షావుకారి దగ్గర చేరారు. సావుకారి చిట్టా కాగితాలు తీస్తూ—

"ఏటిరా గుమస్తా వస్తే గుద్ద బలిసిన కబుర్లాడారాటర్రా"

"స్నేద్ సావుకారే! ఈయ్యేడు బొత్తిగ పండనేదు యితనాలైనా రాలేదు ఎలాగిత్తామ్ నాలుగొందలు"

"ఏ'టేటిరా! అయితేటంతార్రా పంటబోయిందని తిండి మానిత్తరేటిరా!" అన్నాడు సావుకారి.

1016

క్రామేడ్లు చెప్పిన మాట ఎలాగ చెప్పాలా అని అందరూ ఆత్రుతై పోతంద్రు... ఎపులా ఎదురుబడి చెప్పనేపోవ్తద్రు

సాపుకారికి అనుమానం బయం పెరిగిపోతన్నయ్ వడ్డీ పెయ్యాలని వస్తాడు గానేటి అసలుకే మోసమొత్తంది.

"ఏటిరా! ఎగమెద్దెడానికి చూత్తన్నరేటిరా"

ముఖలింగంగాడు నసుగుతున్నాడు నసుగుతుంటే కళ్ళముందు క్రామేడ్ల మాటలు మెదులుతున్నాయి. ఏయ్. ఏటయిపోద్ది.... మహా అయితేదళంలో చేరిపోతను అనుకున్నాడు ధైర్యం కూడగట్టుకొని

"అప్ప సాపుకారి! ఎగమెట్టడంక్కాదూ.... అబ్బాయి మాది. మాతాతలు తవ్వేనారు....మా....అయ్యలు కట్టబడ్డారు నీకెందుకు పన్నుగట్టాల" అన్నాడు.

"ఒరే త్రాగేసి గట్రా మాట్లాడతన్నవా! నేపోవ్తే గొడ్డు మాంసం తినేసి కొవ్వు బలిసిపోయిందే" దగ్గర నుంచి నెగిసిపోయి ముఖలింగం ముఖంమ్మీద చేయ్యేసి అన్నాడు.

"స్నేద్ సాపుకారీ మీం కట్టం మీ కట్టమంతే కట్టమే" అన్నారెవులో

"తెలిపుండే మాట్లాడతున్నమ్" అన్నారింకెవులో.

"అవునురా ఆలదన్నూ, ఈలదన్నూ, అన్నలదన్నూ ఉన్నదని మితిమీరి పోతన్నుగావల! అప్పుడి నాగకొండ దొక్కపెట్టి మక్కలిరగదన్నితే అప్పుడు తెలుత్తాది మాసత్తా" అన్నాడు కోపంగా సాపుకారి.
దళింగాడికి కోపం పుట్టుకొచ్చింది

"స్నూవ్ జడిపించేదేటీ....నీకిక్కడ గెడ్డలెట్టి తంతే ఎపులుదిక్కు" అన్నాడు దళిమియ్య

సాపుకారికి బయమేసింది. అరుగుమీదనుంచి ఇవతల కొచ్చాడు

లోపలనుంచి ఎపులో కుర్రోడు అరుస్తున్నాడు

"అప్పుడు సింగలపడిన చేపలాగ దొర్కిపోనం ఇప్పుడు దేశమంతా మా అన్నలున్నారు వోయ్".

సాపుకారి రెండడుగులు ముందుకేసి—

"ఉండర్రా మీసంగతి తేలుత్తాను" అన్నాడు

1017

"మహా చేత్తే ఏటి చేత్తావ్ జైల్లోట్టిత్తావ్ ఈవాళ జైలు రేపు బెయిల్ అంతేనా మరేటుందా" అన్నారెవరో....

పత్తికోలు ముసిలోడు మంచమ్మీద నుంచి లేచేసరికి ఊరి చివర కెలిపోనాడు సాపుకారి. అయినా ముసిలోడు మునకాలు తీసుకొని నాలుగడుగులేసి

"అప్పుడు నాగక్కాడ్ వోయ్ కేసు పెట్టీనానికి, కేసులెట్టి నరసన్నపేటల కూకోని తినొచ్చు అనుకుంతన్నపుగాన్ల—ఇప్పుడు కామ్రేడ్లునీపూరి నరసన్నపేటలా పున్నారుమీ అత్తోచూరు అమదాల వలసలాపున్నారుఇక్కడ కాసికబురెడితే అక్కడ నీ అంతు చూసెత్తరు" అన్నాడు. సాపుకారి గుండెజల్లుమంది మొన్నంతే మొన్నే నరసన్నపేట యస్సైకి సితక్కతన్నీసినారు. అమ్మో ఈలమీద కేసుపెట్టడానికి పనికి రాదు.... అమ్మో ఈ తోవలా గట్టా అన్నలు లేరుకదా! గుండెలు కొట్టుకుంటుంటే గబగబ అడుగులేసాడు.

"ముల్లొచ్చినావంతే నీ పెల్లం పిల్లల్నికానవు" మొఖలింగం ఈ మాట అనేసి మునకాలు కర్ర బూమికేసి కొట్టాడు.

ఈ భూమి నాది అన్నట్టుగుంది ఆ కొట్టడము.

సాపుకారి ఒక్కొక్క అడుగు భూమి మీద నుంచి తీస్తుంటే కాల్లకిందనున్న గడ్డిపరకలు లేచి కొనలు దులుపుకుంటున్నాయి.

వెలువడింది : సృజన ప్రచురణ

విచ్ఛిన్నమవుతున్న వ్యక్తిత్వం

మాగ్జింగోర్కీ

56 పేజీలు 5 రూపాయలు

ప్రతులకు : 1. సృజన, ఫ్లాట్ 11 బ్లాక్ 2, ఎం.ఐ.జి II
బాగ్‌లింగంపెల్లి, హైదరాబాదు - 500 044.

2. పీస్‌బుక్ సెంటర్, 1-8-518/16/2,
వేంకటేశ్వరాలయం దగ్గర, చిక్కడపల్లి,
హైదరాబాద్ - 500 020

1018